## క్లుప్తంగా

### వృద్ధులకు అన్నదానం



అన్నదానం చేస్తున్న వ్యవసాయ అధికారి ఈశ్వరరెడ్డి

కడప ఎడ్యుకేషన్: కడప నగరం సమీపంలోని అజాద్ నగర్ లో ఉన్న బృందా వృద్ధాశ్రమంలో సీకే దిన్నె మండలం అగ్రికల్చర్ ఆఫీసర్ కే ఈశ్వర్ రెడ్డి తనయుడు కె నివేద్ కార్తీక్ రెడ్డి పుట్టినరోజు ను పురస్కరించుకొని అన్నదానం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గీత, సురేష్, శ్రీకాంత్, వృద్ధాశ్రమ నిర్వాహకులు అట్లూరి బాలసుబ్బయ్య, సుధారాణి తదితరులు పాల్గొన్నారు.

### ప్రారంభమైన మా ఎగ్జిబిషన్ అండ్ సేల్

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరం హరిత హోటల్‌లో శనివారం మా ఎగ్జిబిషన్ అండ్ సేల్ ప్రారంభమైంది. ఉదయం నుంచే ప్రజలు తరలివచ్చి అత్యాధునిక డిజైన్లతో కూడిన ఆభరణాలు, వస్త్రాలను కొనుగోలు చేశారు. దసరా పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్ మరో రెండురోజులపాటు ఉంటుందని, డ్రస్ మెటీరియల్స్, శారీస్‌పై ప్రత్యేకంగా 20–40 శాతం ప్రత్యేక డిస్కౌంట్ ఇస్తున్నామని నిర్వాహకులు తెలిపారు. వీటితో పాటు గృహావసరాలకు ఉపయోగపడే అనేక వస్తువులు అందుబాటులో ఉన్నాయని వారు వివరించారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### రిమ్స్ రోడ్డును బాగు చేయండి

కడప వైఎస్ఆర్ సర్కిల్: అసలే రోగులు.. వివిధ జబ్బులతో ఆసుపత్రికి వస్తే వర్షాలు కురుస్తున్న రోజుల్లో నడవడానికి ఏమాత్రం సాధ్యపడని రోడ్లపై పేషంట్లను స్ట్రక్చర్లపై, వీల్ చైర్ లపై అవతలికి, ఇవతలకి ఎలా తీసుకుపోవాలని, రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు మడగలం ప్రసాద్ ప్రశ్నించారు. శనివారం రిమ్స్ ఓపి పరిసర ప్రాంతాలలో ఆర్‌సీపీ నాయకులు పర్యటించారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, తులసి రామ్ పాల్గొన్నారు.

### హాస్పిటల్‌లోని సమస్యలను పరిష్కరించాలి



రిమ్స్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్: కడప నగరంలోని రిమ్స్ పరిధిలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిలో అనేక సమస్యలు తిష్ట వేసి ఉన్నాయని, వాటి పరిష్కారానికి తక్షణమే జిల్లా అధికార యంత్రాంగం కృషి చేయాలని సీపీఎం కడప నగర కార్యదర్శి రామమోహన్ డిమాండ్ చేశారు. శనివారం ఉదయం కడప నగరంలోని రిమ్స్ పరిధిలో ఉన్న సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రిని సీపీఎం బృందం పరిశీలించింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప నగరంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి సమస్యలకు నిలయంగా మారిందన్నారు. కోట్ల రూపాయల ఖర్చుపెట్టి నిర్మించిన ఆసుపత్రి సరైన సిబ్బంది లేక అనేక సమస్యలను ఎదుర్కొంటోందని తెలిపారు. 450 పడకల ఆసుపత్రిలో దాదాపు 10 మంది డాక్టర్లు, 140 మంది స్టాఫ్ నర్సులు, ఏంఎన్ఓ, ఎఫ్ఎన్ఓ, లాబ్ టెక్నీషియన్లు, వార్డు బాయ్స్ కొరత తీవ్రంగా ఉందన్నారు. నియామకాలన్నీ వెంటనే పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు దస్తగిరి రెడ్డి, నగర కమిటీ సభ్యుడు కుమారస్వామి రెడ్డి, రామకృష్ణారెడ్డి, నరసింహ, గోపాల కృష్ణయ్య పాల్గొన్నారు.

### వైఎస్సార్‌సీపీ రాష్ట్ర విభాగ కమిటీల్లో నియామకాలు

కడప కార్పొరేషన్: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు అన్నమయ్య జిల్లాకు చెందిన దిగువ పేర్కొన్న నాయకులను పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో వివిధ హోదాలలో నియమిస్తూ ఆ పార్టీ కేంద్ర కార్యాలయం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర రైతు విభాగం సంయుక్త కార్యదర్శిగా మదనపల్లెకు చెందిన టి. నాగరాజరెడ్డి, రాష్ట్ర మున్సిపల్ విభాగం కార్యదర్శిగా రాయచోటికి చెందిన షేక్ రియాజ్ ఉర్ రెహమాన్, రాష్ట్ర సోషల్ మీడియా విభాగం కార్యదర్శిగా రాయచోటికి చెందిన ఎం. ప్రవీణ్ కుమార్‌రెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శులుగా శివ(తంబళ్లపల్లె), వి. హరి(పీలేరు), ఎస్సీసెల్ రాష్ట్ర సంయుక్త కార్యదర్శిగా పీలేరుకు చెందిన మద్దెల రవీంద్రలను నియమించారు.

**వైఎస్సార్ కడప జిల్లాలో...**

రాష్ట్ర మున్సిపల్ విభాగం సంయుక్త కార్యదర్శిగా బద్వేల్‌కు చెందిన జి. కేశవరెడ్డి, రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శిగా కడపకు చెందిన కూకట్లపల్లె బాబు, రాష్ట్ర ఎస్సీసెల్ సంయుక్త కార్యదర్శిగా ప్రొద్దుటూరుకు చెందిన గుర్రం లావణ్య, రాష్ట్ర వైఎస్సార్‌టీఎఫ్ ప్రధాన కార్యదర్శిగా జమ్మలమడుగుకు చెందిన కె సంజీవరెడ్డిలను నియమించారు.

# నగర ఆలయాలకు శరన్నవరాత్రి శోభ

కడప సెవెన్‌రోడ్స్ : దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. పది రోజులపాటు అంగరంగ వైభవంగా జరిగే ఈ ఉత్సవాలకు నగరంలోని ప్రధాన ఆలయాలను ముస్తాబు చేశారు. ఇప్పటికే భారీ సెట్టింగ్‌లు, చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. దీంతో ఆలయాలు ఉత్సవ శోభను సంతరించుకున్నాయి. ఉత్సవాల్లో భాగంగా వివిధ ఆలయాల్లో నిర్వహించే అమ్మవారి అలంకారాలు ఇలాఉన్నాయి.

**గడ్డిబజారు ఆలయంలో..**

ఉభయ దాతల సహకారంతో శరన్నవరాత్రి కార్యక్రమాలు జరుగుతాయని గడ్డిబజారులోని శ్రీ లక్ష్మి సత్యనారాయణ స్వామి ఆలయ వంశ పారంపర్య అర్చకులు కేహెచ్ విజయ్‌భట్టర్ తెలిపారు. తొలిరోజు ఉదయం 6.00 గంటగలకు స్వామి వారికి తిరుమంజనం, ప్రతిరోజు సాయంత్రం 7.00 గంటలకు విశేష అలంకరణ ఉంటుందన్నారు. ఉత్సవాల్లో భాగంగా ఈనెల 22 నుంచి అక్టోబరు 2వ తేది వరకు శ్రీ లక్ష్మిసత్యనారాయణస్వామి ఆలయంలో రోజుకో అలంకారాన్ని ఏర్పాటు చేయనున్నారు. ఈనెల 22న శ్రీ కోదండరామ అలంకారం, 23న శ్రీకృష్ణ అలంకారం, 24న శ్రీ రాధాకృష్ణ అలంకారం, 25న శ్రీవైకుంఠనాథ అలంకారం, 26న శ్రీ లక్ష్మి నారాయణ అలంకారం (తోట ఉత్సవం) నిర్వహిస్తారు. 27న శ్రీ వెంకటేశ్వరస్వామి అలంకారం (గరుడ సేవ) ఉంటుంది. 28న శ్రీ రంగనాథ అలంకారం, 29న శ్రీ నరసింహా అలంకారం, 30న శ్రీ కాళీయమర్దన అలంకారం ఉంటుంది. ఆరోజు లడ్డూ టోకన్ డిప్ తీయనున్నారు. అక్టోబరు 1న మోహినీ అలంకారం, 2వ తేది శమీ దర్శనం, విజయదశమి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. అదేరోజు గ్రామోత్సవం నిర్వహిస్తారు.



విద్యుద్దీప అలంకరణలో గడ్డిబజారులోని శ్రీ లక్ష్మిసత్యనారాయణస్వామి ఆలయం

**శ్రీ లలితాపంచాయతన ఆలయంలో..**

22న దీక్షాబంధనం, 23న శ్రీ బాల త్రిపురసుందరీదేవి, 24న శ్రీ గాయత్రిదేవి, 25న శ్రీ అన్నపూర్ణాదేవి, 26న శ్రీ రాజరాజేశ్వరీదేవి, 27న శ్రీ అరుణ సరస్వతిదేవి, 28న శ్రీ మహాలక్ష్మిదేవి, 29న శ్రీ సరస్వతిదేవి, 30న శ్రీ దుర్గాదేవి, అక్టోబరు 1న శ్రీ మహిషాసుర మర్దినిదేవి, 2న శ్రీ లలితా త్రిపుర సుందరి దేవి అలంకారాలు ఉంటాయి.

**నడివీధి గంగమ్మ దేవస్థానంలో..**

నగరంలోని హనుమప్పవీధిలో వెలిసిన నడివీధి గంగమ్మ తల్లి ఆలయంలో ఈనెల 22 నుంచి అక్టోబరు 5వ తేది వరకు శరన్నవరాత్రి మహోత్సవాలను ఘనంగా నిర్వహించాలని ఉత్సవ కమిటీ సభ్యులు నిర్ణయించారు. తొలిరోజు అమ్మవారికి అభిషేకం, తర్వాత ప్రతిరోజు ప్రత్యేక అలంకారాలు, విశేష పూజలు, రాత్రి 10.30 గంటలకు మహా మంగళ హారతి, తీర్థ ప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఉత్సవాల్లో భాగంగా 22న దీక్షా బంధన అలంకారం, 23న శ్రీ రాజరాజేశ్వరీదేవి అలంకారం, 24న శ్రీ అన్నపూర్ణదేవి అలంకారం, 25న శ్రీ కామాక్షిదేవి అలంకారం, 26న శ్రీ సంతానలక్ష్మి అలంకారం, 27న శ్రీ మధురమీనాక్షి అలంకారం (తోటోత్సవం), 28న శ్రీ నడివీధి గంగమ్మతల్లి అలంకారం, 29న శ్రీ సరస్వతిదేవి అలంకారం, 30న శ్రీ మహిషాసురమర్దిని అలంకారం, అక్టోబరు 1న శ్రీ పార్వతిదేవి అలంకారం, 2న దసరా ఉత్సవం, 3న వసంతాలు నిర్వహించనున్నారు.

**భావనా రుషి ఆలయంలో..**

22న మూలవర్లకు అభిషేకం, దీక్షాబంధనం, లక్ష్మి అమ్మవారికి పంచామృతాభిషేకం, కలశస్థాపన, బొమ్మల కొలువు, పూజా కార్యక్రమాలు, సామూహిక లలిత సహస్ర నామ పారాయణం, కుంకుమార్చన, మంగళ హారతి, తీర్థ ప్రసాద వినియోగం ఉంటుంది. సాయంత్రం 7.00 గంటల నుంచి అలంకార దర్శనం, మహామంగళ హారతి, సర్వదర్శనం ఉంటాయి. 22న శ్రీమహేశ్వరిదేవి అలంకారం, 23న శ్రీ వైష్ణవి దేవి అలంకారం, 24న శ్రీ వినాయికిదేవి అలంకారం, 25న శ్రీ బ్రహ్మిదేవి అలంకారం, 26న శ్రీ మహాలక్ష్మిదేవి అలంకారం, 27న శ్రీ వారాహి దేవి, 28న శ్రీ లలితాదేవి అలంకారం, 29న శ్రీ సరస్వతిదేవి అలంకారం, 30న శ్రీ మహిషాసురమర్దిని అలంకారం, అక్టోబరు 1న శ్రీ ప్రత్యంగిరాదేవి అలంకారం, 2న విజయదమి గ్రామోత్సవం నిర్వహిస్తారు.

### పాఠశాలల్లో ముందస్తు దసరా వేడుకలు

కడప ఎడ్యుకేషన్: కడప నగరంలోని పలు పాఠశాలల్లో శనివారం ముందస్తు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులంతా దేవతా మూర్తుల వేషధారణలో వచ్చి ఆకట్టుకున్నారు. ఇందులో భాగంగా సాయిబాబా హైస్కూల్, శ్రీచైతన్య, నారాయణ స్కూళ్లో ముందస్తు దసరా ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు.




సాయిబాబా హైస్కూల్‌లో..



శ్రీ చైతన్య స్కూల్‌లో..



నారాయణ స్కూల్‌లో..

### ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలి



కోటిరెడ్డి సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న ఆర్ఎస్‌యూ నాయకులు

కడప ఎడ్యుకేషన్: రాష్ట్రవ్యాప్తంగా పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను వెంటనే విడుదల చేయాలని ఆర్ఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రశాంత్ డిమాండ్ చేశారు. శనివారం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు కడప కోటిరెడ్డి సర్కిల్‌లో ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం రూ. 6400 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నాయన్నారు. ఇప్పటికే విద్యార్థులు ఉన్నత చదువులు చదవాలంటే విద్యార్థులకు సర్టిఫికెట్లు యాజమాన్యాలు ఇవ్వక ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం స్పందించి నిధులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్‌యూ కడప నగర అధ్యక్షుడు గురుమోహన్ యాదవ్, కార్యదర్శి రాఘవ, నాయకులు సునీల్, ప్రమోద్, కిరణ్, విజయ్ సందీపు పాల్గొన్నారు.

### మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలి



మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి

కడప కార్పొరేషన్: రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటైన 10 మెడికల్ కాలేజీలను ప్రైవేటీకరించాలన్న ఆలోచనను ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి పి. జయచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. శనివారం జిల్లా పార్టీ కార్యాలయంలో పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు దాసరి శివప్రసాద్, ఈస్ట్ జోన్ అధ్యక్షుడు పి. రామ్మోహన్ రెడ్డిలతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన పాలనలో విద్య, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇచ్చారన్నారు. కరోనా వంటి విపత్కర పరిస్థితులు ఎదురైనప్పుడు ఇబ్బంది పడకుండా ప్రతి జిల్లాకు ఒక మెడికల్ కాలేజీని ఏర్పాటు చేయాలన్న సంకల్పంతో ఏకంగా 17 కొత్త మెడికల్ కాలేజీలను మంజూరు చేయించి అందులో 5 మెడికల్ కాలేజీలను పూర్తి చేశారని, మరో రెండు కాలేజీల్లో దాదాపు అన్ని వసతులు పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉంచారన్నారు. పదిహేనేళ్లు ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఒక్క కొత్త మెడికల్ కాలేజీని రాష్ట్రానికి తీసుకురాలేదని ఎద్దేవా చేశారు. పులివెందుల మెడికల్ కాలేజీకి ఎన్ఎంసీ 50 సీట్లు మంజూరు చేస్తే వాటిని వద్దని లేఖ రాసిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కిందన్నారు.

### సైలెన్సర్‌తో శబ్దాలు చేస్తే చర్యలు



సైలెన్సర్‌లను ధ్వంసం చేసే సమయంలో పరిశీలిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

కడప అర్బన్: కడపలో టూవీలర్లకు సైలెన్సర్లు బిగించుకుని భారీ శబ్దాలు చేసుకుంటూ తిరుగుతున్న వారిపై జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ షెల్కె ఉక్కుపాదం మోపారు. ఎస్పీ ఆదేశాల మేరకు కడప టౌన్ డీఎస్పీ వేంకటేశ్వర్లు ఆధ్వర్యంలో కడప ట్రాఫిక్ సీఐ డి.కె. జావీద్, ట్రాఫిక్ ఎస్ఐ యు.వై జయరాములు, ట్రాఫిక్ సిబ్బంది కలిసి టూవీలర్లకు మాడిఫై సైలెన్సర్లు బిగించుకుని భారీ శబ్దాలు చేసుకుంటూ తిరిగే వారిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. కడప నగర పోలీసులు స్వాధీనం చేసుకున్న 50 టూవీలర్ల సైలెన్సర్లు లను రోడ్డు రోలర్ తో ధ్వంసం చేయించారు. స్థానిక ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ దగ్గర డీఎస్పీ శనివారం రోడ్డు రోలర్ తో తొక్కించి ధ్వంసం చేయించారు.

# విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలి

– విద్యుత్ భవన్ ఎదుట
రిలే నిరాహార దీక్షల్లో నేతల డిమాండ్

కడప కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్టు కార్మికులను వెంటనే పర్మినెంట్ చేయాలని జిల్లా విద్యుత్ జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. శనివారం కడప విద్యుత్ భవన్ ఎదుట ఆంధ్రప్రదేశ్ స్టేట్ పవర్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపు మేరకు జిల్లా జేఏసీ ఆధ్వర్యంలో విద్యుత్ భవన్ వద్ద రెండో రోజు రిలే నిరాహార దీక్షలు నిర్వహించారు. ఈ దీక్షల్లో సుమారు 50 మంది విద్యుత్ ఉద్యోగులు, కార్మికులు కూర్చొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర జేఏసీ ఛైర్మన్ ఎస్. క్రిష్ణయ్య మాట్లాడుతూ విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో విద్యుత్ సంస్థల యాజమాన్యం తీవ్ర నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వంలో అమలులో ఉన్న జీపీఎఫ్‌తో కూడిన పెన్షన్ నిబంధనలను 1999 ఫిబ్రవరి 1 నుండి 2004 ఆగస్టు 31వరకు నియమింపబడిన ఉద్యోగులందరికీ వర్తింపజేయాలన్నారు. ఎన్నో సంవత్సరాల నుండి పనిచేస్తున్న కాంట్రాక్ట్ లేబర్, అవుట్ సోర్స్ ఉద్యోగులకు యాజమాన్యమే నేరుగా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జేఏసీ కో కన్వీనర్ కేవీ శేషారెడ్డి మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు, అడిషనల్ లేబర్ కమిషనర్ రిపోర్టు ప్రకారం సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని, దీర్ఘకాలిక సర్వీసు గల వారందరిని విద్యుత్ సంస్థలలో విలీనం చేయాలన్నారు. వైస్ ఛైర్మెన్ బి. రామలింగారెడ్డి మాట్లాడుతూ 2019లో నియమింపబడిన ఎనర్జీ అసిస్టెంట్లు (జే.ఎల్.ఎం (గ్రేడ్–2) లను రెగ్యులర్ జే.ఎల్.ఎం.లుగా పరిగణించి వేతనాలు తదితర ప్రయోజనాలన్నీ కల్పించాలన్నారు. ఇంజనీరింగ్ డిగ్రీ కలిగిన జూనియర్ ఇంజనీర్లకు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లుగా పదోన్నతిలో ఒక అవకాశం కల్పించాలని, అర్హులైన ఓ అండ్ ఎం తదితర సర్వీసులకు చెందిన ఉద్యోగులను జూనియర్ అసిస్టెంట్, జూనియర్ ఇంజనీర్ ఖాళీలలో నియమించాలన్నారు. ఈ దీక్షల్లో అధిక సంఖ్యలో ఉద్యోగులు కూర్చొన్నారు. ఈ కార్యక్రమంలో కాంట్రాక్టు ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలకాశి, కె. నాగరాజు, 1104 యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్ రావు, జిల్లా జేఏసీ ఛైర్మెన్ బార్నబాస్, జేఏసీ కన్వీనర్ ఎం.వి. చలపతి , కె. బ్రహ్మానందరెడ్డి, వై. నాగరాజు, ఎం. యాకోబు, దవనం దొరబాబు, పురుషోత్తం పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ ఎదుట రిలే నిరాహార దీక్షలు చేస్తున్న విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు

# విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం

కడప కార్పొరేషన్: విద్యుత్ కాంట్రాక్టు కార్మికుల, ఉద్యోగుల సమస్యలు పరిష్కరించే వరకూ పోరాటం ఆగదని సీఐటీయూ నాయకులు హెచ్చరించారు. శనివారం విద్యుత్ భవన్ ఎదుట ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్(సిఐటియూ) ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు అధ్యక్షుడు కె. శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విధంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా కోటి రూపాయలు ఇన్సూరెన్స్ కార్మికులకు ఇవ్వాలన్నారు. 20 సంవత్సరాలుగా పనిచేస్తున్న విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలన్నారు. కొత్త ఆపరేటర్లందరికి పాత ఆపరేటర్లతో సమానంగా జీతాలు ఇవ్వాలని, ఫీల్డ్ అసిస్టెంట్లు అందరికీ స్కిల్డ్ వేతనాలు ఇవ్వాలన్నారు. ఈ సమస్యలపై అనేక సార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయినా యాజమాన్యం పట్టించుకోలేదన్నారు. ఈ సమస్యల పరిష్కారానికి అక్టోబర్ 6వ తేదీన ఎస్పీడీసీఎల్ తిరుపతి కార్యాలయం ముట్టడి కార్యక్రమం నిర్వహిస్తున్నామని, కార్మికులు ఈ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కే శ్రీనివాసరావు, వర్కింగ్ ప్రెసిడెంట్ డి.రమేష్, పి సి కొండయ్య, మల్లికార్జునరెడ్డి, చంద్రమౌళి, రవిశేషయ్య, సంజీవ రెడ్డి, బాష, నాగరాజు, పెద్దయ్య, మధుసూదన్ నాయుడు, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ డిస్కం అధ్యక్షులు ఎస్ శివశంకర్, జిల్లా ట్రెజరర్ సురేంద్ర, జిల్లా నాయకులు షరీఫ్, లెనిన్ బాబు, నాగ మల్లయ్య పాల్గొన్నారు.



విద్యుత్ భవన్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు

# ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం



ఉత్తమ ఉపాధ్యాయులు కృష్ణారావు, రియాజున్నిసాలను సన్మానిస్తున్న వీసీ



ఉత్తమ ఉపాధ్యాయుడు దాది నాగరాజును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

కడప ఎడ్యుకేషన్: విద్యార్థుల జీవితాలకు వెలుగు దివ్వెలు గురువులు అని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు స్పష్టం చేశారు. యోగి వేమన యూనివర్సిటీ టీచర్స్ అసోసియేషన్(యూటా) ఆధ్వర్యంలో ఈ ఏడాది రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు కెమిస్ట్రీ ప్రొఫెసర్ కెఎస్వీ కృష్ణారావు, బయోటెక్నాలజీ అండ్ బయో ఇన్ఫర్మేటిక్స్ ప్రొఫెసర్ కె. రియాజున్నిసా లకు సన్మాన కార్యక్రమం వైవీయూ సైన్స్ బ్లాక్ లోని సెమినార్ హాల్లో శనివారం నిర్వహించారు. వారిని ఉపకులపతి అభినందించారు. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.పద్మ, ప్రిన్సిపల్ ప్రొఫెసర్ టి. శ్రీనివాస్ , యూటా అధ్యక్షులు ప్రొఫెసర్ ఏ మధుసూదన్ రెడ్డి , యూటా ప్రతినిధి ప్రొఫెసర్ జి. పార్వతి పాల్గొన్నారు.

– కడప మున్సిపల్ కార్పొరేషన్ మోడల్ ప్రైమరీ స్కూల్ 8 వ వార్డ్ సాయిపేట పీఎస్ హెచ్ ఎంగా పనిచేస్తూ, రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొంది ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న దాది నాగరాజును శనివారం సాయిపేట క్లస్టర్ లో కాంప్లెక్స్ చైర్ పర్సన్ కవిత సుధారాణి ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సజ్జల వెంకట రమణా రెడ్డి, రెడ్డిబాబు పాల్గొన్నారు.

# సంజన్న సర్కిల్‌లో మరమ్మతులు



సంజన్న సర్కిల్‌లో పైపులైన్‌కు మరమ్మతులు చేస్తున్న దృశ్యం



పాడైన రోడ్డుకు జేసీబీతో త్రవ్వుతూ మరమ్మతులు చేస్తున్న దృశ్యం

కడప కార్పొరేషన్: కడప నగరం చిన్నచౌకులోని సంజన్న సర్కిల్‌లో పైపులైన్ పగిలిపోయింది. దీనివల్ల త్రాగునీరు వృథా కావడమేగాక రోడ్డంతా పూర్తిగా పాడైపోయింది. రోడ్డు పాడైన విషయంపై గతంలో రెండు సార్లు సాక్షి వార్తలు ప్రచురించింది. తాజాగా పైపులైన్ లీకేజీపై కూడా 20వ తేది అధికారుల దృష్టికి తెచ్చింది. దీనిపై స్పందించిన నగరపాలక అధికారులు పైపులైన్ లీకేజీకి చర్యలు తీసుకోవడంతో పాటు పాడైన రోడ్డును మరమ్మతులు చేసేందుకు పనులు చేపట్టారు. ఈ రెండు పనులు ఏకకాలంలో చేపట్టడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### నగరంలోని పలు కాలనీలు జలమయం



బుడగజంగం కాలనీలో నిలిచిన వర్షపు నీరు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలో కురుస్తున్న వర్షాలకు పలు కాలనీలు జలమయం అవుతున్నాయి. నగరంలోని 48వ డివిజన్ రామరాజుపల్లి సచివాలయం పరిధిలోని బుడగజంగం కాలనీ, కృపా కాలనీ, యానాది కాలనీలోని పలు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వీధుల్లో వర్షపు నీరు నిలబడడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అంతంత మాత్రంగా ఉన్న రోడ్లు, డ్రైనేజీలు వర్షాల కారణంగా దెబ్బతిన్నాయి. ముఖ్యంగా తమ ప్రాంతంలో అడుగు వేయాలంటే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు ఉన్నాయని, చిన్నారులు, వృద్ధుల పరిస్థితి వర్ణనాతీతంగా ఉందని స్థానికులు వాపోతున్నారు. తమకు వరద నీటి నుంచి శాశ్వత పరిష్కారం చూపి, మౌలిక సదుపాయాలు కల్పించాలని, డ్రైనేజీ కాలువలు, సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు. జిల్లా కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ సత్వరమే వరద ప్రభావిత ప్రాంతాలను పర్యటించి ఆదుకోవాలని కోరారు.

### వైవీయూలో క్యాంపస్ డ్రైవ్



ఉద్యోగానికి ఎంపికైన అమ్మాయికి అపాయింట్‌మెంట్ లెటర్‌ను అందచేస్తున్న వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వవిద్యాలయం ప్లేస్ మెంట్ డైరెక్టర్ ఆచార్య విజయభారతి ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన క్యూ– స్పైడర్ కంపెనీవారు ప్లేస్‌మెంట్ డ్రైవ్ నిర్వహించారు. ఎంసీఏ, ఎమ్మెస్సీ కంప్యూటర్స్, ఎమ్మెస్సీ డేటా సైన్స్ విద్యార్థులు 80 మంది హాజరయ్యారు. బెంగళూరు క్యూ స్పైడర్ కంపెనీ ప్రతినిధులు ఐశ్వర్య, అరుణిమలు అభ్యర్థులకు రాత పరీక్ష , గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 19 మందిని ప్రోగ్రామింగ్ డెవలపర్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. ఎంపికైన వారికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు నియామకపు పత్రాలను అందజేశారు. పీజీ చదువుతూ ఉండగానే రూ.3 నుంచి 9 లక్షల ప్యాకేజీ తో ఉద్యోగాలు పొందడం ప్రశంసనీయమని వారి అభినందించారు. ప్లేస్మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి ప్రత్యేక శ్రద్ధను ప్రశంసించారు.

### రక్తదానం

కడప కోటిరెడ్డిసర్కిల్ : దేశ ప్రధాని నరేంద్రమోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని కడపలోని బీజేపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరంలో పలువురు బీజేపీ నేతలు పాల్గొని రక్తదానం చేశారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు మాట్లాడుతూ బీజేపీ అధిష్ఠానం ఆదేశాల మేరకు ప్రధానమంత్రి నరేంద్రమోది జన్మదినం సెప్టెంబర్ 17 మొదలుకొని 15 రోజుల వరకు సేవా పక్షోత్సవాలు పేరుతో సేవా కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. అనంతరం జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ యువ నాయకులు ఓబులేశు తదితరులు రక్తదానం చేశారు. శిబిరంలో పాల్గొని రక్తదానం చేసిన వారికి బీజేపీ నాయకులు సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ప్రవీణ్, బాలకృష్ణ యాదవ్, లక్ష్మీనారాయణ రెడ్డి, చేపూరి శారదమ్మా, అంబిక, కళ్యాణ్ రాజు, శివ ప్రసాద్, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

### పోషకాహారంతో ఆరోగ్యం



చిన్నారికి అన్నప్రాసన చేస్తున్న అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : సమతుల పోషకాహారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యకరంగా జీవించవచ్చని ఐసీడీఎస్ అధికారులు తెలిపారు. శనివారం కడప అర్బన్ ప్రాజెక్టు పాత కడప సెక్టార్‌లోగల యూపీహెచ్‌సీలో రాష్ట్రీయ పోషణ మాసం సందర్భంగా గర్భిణీలు, తల్లులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ 16 వరకు పోషణ మాసం నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం వారు స్థూలకాయ నివారణ, శిశు సంరక్షణ, గర్భవతులు, బాలింతలు, కిశోర బాలికలకు రక్తహీనత రాకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. కార్యక్రమంలో భాగంగా గర్భిణీలకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ ఉమామహేశ్వర్ కుమార్, హెచ్ఈఓ శ్రీదేవి, ఏసీడీపీఓ శోభారాణితోపాటు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, అంగన్వాడీ వర్కర్లు పాల్గొన్నారు.

### ఎమ్మెల్సీకి వినతి

కడప ఎడ్యుకేషన్: ఏపీ వ్యాప్తంగా ఇంజనీరింగ్, డిగ్రీ, మెడిసిన్ , నర్సింగ్‌తోపాటు ఇతర కాలేజీలకు సంబంధించిన ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయాన్ని మండలిలో చర్చించాలని ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని ప్రగతిశీల విద్యార్థి యువజన సమైఖ్య రాష్ట్ర కమిటీ కన్వీనర్ కత్తి ఓబులేసు, జిల్లా కమిటీ నాయకులు బయన్న కోరారు. ఈ విషయమై శనివారం ఎమ్మెల్సీ రామచంద్రారెడ్డిని కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. సంబంధిత సమస్యల గురించి విద్యార్థుల తరఫున మాట్లాడాలని ఎమ్మెల్సీని కోరారు.